# 8

# యేసు పరిచర్య ప్రారంభము

## (4:12-25)

యేసు సాతాను చేత శోధింపబడిన పిమ్మట (4:1–11), అయితే బాప్తిస్మమిచ్చు యోహాను చతుర్థాతిపతియైన హేరోదు చేత చెరసాలలో వేయబడక మునుపు (4:12; 14:3–15 చూడుము), యోహాను 1:19–3:36లో రాయబడియున్న విధంగా, ఆయన తన పరిచర్యలో నిమగ్నమై యుండెను. మత్తయి, సువార్త రచయితలైన మార్కు మరియు లూకాతో పాటు, ఆ కాలమును దాటిపోయాడు.

ఈ విభాగము (4:12–25) యేసు పరిచర్యకు ఒక పరిచయముగా పనికివచ్చుచున్నది మరియు కొండమీద ప్రసంగమునకు దారి తీయుచున్నది (5:1–7:29). మత్తయి, యేసు ప్రభువు కపెర్నహూములో స్థిరనివాసమేర్పర్చుకొనుట లేఖనముల నెరవేర్పై యున్నదని చిత్రీకరించుచున్నాడు (4:12–17), నలుగురు శిష్యులను యేసు పిలిచిన వివరమును గ్రంథస్థం చేయుచున్నాడు (4:18–22), మరియు యేసు ప్రభువు చేసిన పరిచర్య మరియు అట్టి పరిచర్య మూలమున ప్రభావితమైన పరిసర ప్రాంతముల గూర్చి ఒక సారాంశమును సమకూర్చుచున్నాడు (4:23–25).

### కపర్నహూములో స్థిరనివాసమేర్పరచుకొనుట (4:12–17)

**[12-16]యోహాను చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగి వెళ్లి నజరేతు విడిచి జెబూలూను నఫ్తాలి యను దేశముల ప్రాంతములలో సముద్రతీరమందలి కపెర్నహూమునకు వచ్చి కాపురముండెను.**

**–జెబూలూను దేశమును, నఫ్తాలిదేశమును, యొర్దానుకు**
**అవలనున్న సముద్రతీరమున అన్యజనులు నివసించు**
**గలిలయయు చీకటిలో కూర్చుండియున్న ప్రజలును**
**గొప్ప వెలుగు చూచిరి. మరణ ప్రదేశములోను**
**మరణచ్ఛాయలోను కూర్చుండియున్నవారికి వెలుగు**
**ఉదయించెను**

**అని ప్రవక్తయైన యెషయా ద్వారా పలుకబడినది నెరవేరునట్లు (ఈలాగు జరిగెను).**
**[17]అప్పటినుండి యేసు–పరలోకరాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను.**

**వచనము 12.** క్రీస్తు పరిచర్యయందలి ఈ సమయంలో **యోహాను చెరపెట్టబడినప్పటికిని,** ఈ విషయము యొక్క వివరములను మత్తయి 14వ అధ్యాయం వరకు కూడ పదిలంగా పక్కన బెట్టాడు (14:1–12). యోహాను చెరపెట్టబడిన వార్త **యేసు**

**తెలిసికొనినప్పుడు, ఆయన గలిలయకు తిరిగి వెళ్లాడు.** ఇందుకు గల ఖచ్చితమైన కారణము తెలియజెప్పబడలేదు. “విడిచి వెళ్లెను” లేక “వెళ్లిపోయెను” అని కూడ అనువదింపబడిన “తిరిగి వెళ్లెను” అను పదము, అపాయకరమైన పరిస్థితులను తప్పించుకొను ఉద్దేశమును తెలియజేయుటకు మత్తయి రాసిన సువార్తలో తరుచుగా ప్రయోగింపబడుచున్నది (2:12-15, 22, 23; 12:15; 14:13; 15:21). బోధించుచుండిన ప్రాంతము నుండి తమ్మును తాము దూరము చేసికొనుట అది వారికి తాత్కాలికావశ్యమైన పరిస్థితై యుండినదా? బహుశా కాకపోవచ్చును – ఏలయనగా చతుర్థాధిపతియైన హేరోదు, బాప్తిస్మమిచ్చు యోహాను పెరియలో (యొర్దాను సమీప ప్రదేశములో) పరిచర్య పూర్తియైనది గనుక ఇకనుండి చెరపట్టినవాడు, గలిలయ ప్రాంతమును, యేసు వెళ్లిన ప్రదేశమును కూడ పరిపాలించాడు. లియోన్ మోర్రిస్ ఇలా చెప్పుచున్నాడు, “యోహాను పరిచర్య పూర్తియైనది గనుక ఇక నుండి ఆయన తన పరిచర్యను ప్రారంభించుట అగత్యమని యేసు అర్థంచేసికొన్నాడను సంగతి, ఎక్కువ సహేతుకమైన సాధ్యతగా అగుపించుచున్నది; బాప్తిస్మమిచ్చు యోహాను తన పరిచర్యను అధికంగా అరణ్య ప్రదేశములో చేశాడు గనుక ఇప్పుడు యేసు తన పరిచర్యను ఎక్కువగా గలిలయ ప్రాంతములో నున్న ప్రజల నడుమ చేయనై యుండెను.”[1]

యేసు తన పరిచర్యకు ప్రధాన కేంద్రంగా, యూదయ మరియు పరిశుద్ధ పట్టణమైన యెరూషలేమునకు బదులుగా, గలిలయ ప్రాంతమును ఎన్నుకొన్నడు. యూదా దేశ వాసులు, గలిలయలో నివసించుచుండిన తమ తోటి సహోదరులు వెనుకబడినవారనియు, విద్యావిహీనులనియు వారిని తరుచుగా హీనమైనవారిగా ఎంచుచుండిరి (26:69, 73; యెహాను 7: 41, 52; అపొస్తలుల కార్యములు 2:7; 4:13). అట్లయినప్పటికిని, దేవుడు తరుచుగా “జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెఱ్ఱివారిని ఏర్పరచుకొనుచున్నాడు” (1 కొరింథీయులకు 1:26-29).

**వచనములు 12-16.** యేసు **నజరేతునకు** తిరిగి వచ్చాడు, అది ఆయన స్వస్థలం (2:22, 23). ఏదిఏమైనా, కొద్ది రోజుల్లోనే, ఆయన ఆ స్థలాన్ని విడిచి వెళ్లిపొయాడు – బహుశా అచ్చటి ప్రజలు ఆయనను తృణికరించినందుకు ఆయన వెళ్లిపోయి యుండును (లూకా 4:16-31)[2] – **కపెర్నహూములో, సముద్ర తీరమునకు సమీపమున నున్న తావులో,** తన కార్యకలాపముల కొరకైన ప్రధాన కార్యాలయాన్ని వ్యవస్థాపించుకొన్నాడు. ఈ పట్టణమే అటుతరువాత “తన పట్టణముగా” ప్రస్తావింపబడినది (9:1). ఈ పట్టణము మొదట్లో **జెబూలూను మరియు నఫ్తాలి** గొత్రముల ప్రజలకు కేటాయింపబడిన ప్రాంతములోనుండెను.

కపెర్నహూము ఎక్కడున్నదో చెప్పుకొనుటకు **టెల్‌హూమ్** అత్యంత సహేతుకమైన స్థలమై యున్నది, అది గలిలయ సముద్రమునకు వాయవ్య దిశలో చాలా చివరన ఉన్న తావైయున్నది. సెయింట్ ఫ్రాన్సిస్ అఫ్ అసీస్సీకి సంబంధించిన క్రైస్తవ శాఖకు చెందినవారు 1905లో ఈ తావులో అతి క్షుణ్ణమైన పురావస్తు త్రవ్వకాలు కొనసాగించి వాస్తవమునకు, ఇది ప్రాచీన కపెర్నహూము ఉండిన స్థలమని ఒకరికి చక్కగా ఒప్పించు నిదర్శనాన్ని ప్రజలముందుంచారు. “కపెర్నహూము” అను నామధేయమునకు “నహూము యొక్క గ్రామము” అని అర్థం గనుక అది పాతనిబంధనలోని ఆ ప్రవక్త నహూము యొక్క

స్వస్థలమై యుండవచ్చును. నహూము అను మాటకు “జాలిగల” అని అర్థం. అచ్చటి ప్రజలు ఇతరుల యెడల ప్రదర్శించుచుండిన జాలిగల చిత్తవృత్తినిబట్టి కూడ ఈ గ్రామమునకు కపెర్నహోమను నామకరణము చేయబడియుండవచ్చును.

కపెర్నహూము యేసు బోధలకును ఉపదేశములకును ఒక అనువైన కేంద్ర స్థానమును సమకూర్చినది. అది గలిలయ సముద్ర తీరమున నుండినది, ఈ సముద్రము కిన్నెరెతు సముద్రమనియు (సంఖ్యాకాండము 34:11), గెన్నేసరెతు సరస్సుతీరమనియు (లూకా 5:1), తిబెరియ సముద్రమనియు (యోహాను 21:1) సంబోధింపబడినది. ఈ సముద్రము మనమూహించుచున్నంత పెద్దదేమి కాదు. ఈనాడు, అది ఉత్తరము నుండి దక్షిణ దిశగా దాదాపు పదమూడు మైళ్ల పొడవుండి, తూర్పు నుండి పడమర దిశగా ఎనిమిది మైళ్ల వెడల్పు గలదై యున్నది. అది సముద్ర మట్టమునకు దాదాపు ఏడు వందల అడుగుల క్రిందకు ఉన్నది. దాని తీరములందు పాలస్తీనలోని అనేక పెద్ద ప్రజా పట్టణములుండినవి. దాని గట్టు వెంబడి జనమ్మర్ధమైన తొమ్మిది పట్టణములుండినవి, అయితే ఈనాడు తిబెరియ మాత్రమే నిలిచియున్నది.

యేసు ప్రభువు కపెర్నహూమునకు కదలివెళ్లి దానిని తన పరిచర్య నిమిత్తము కేంద్ర స్థానముగా ఏర్పాటు చేసికొనుట ప్రమాదవశాత్తు జరిగినది కాదు, కానీ **ప్రవక్తయైన యెషయా నోట పలుకబడిన ప్రవచనమును నెరవేర్చుటకే** అని మత్తయి సూచించుచున్నాడు. ఈ వచనములలో మత్తయి ఉల్లేఖించి రచించిన ప్రవచనము యెషయా 9:1, 2 చూడనగును.

ప్రధాన రహదారులు కపెర్నహూములో కలిసికొనుచుండినవి. సిరియా మరియు ఐగుప్తు దేశముల నడుమ వ్యాపార లావాదేవీలు బహు గొప్పగా కొనసాగునట్లు ఈ పట్టణము **ప్రధాన మార్గమై యుండెను,** అది సముద్ర మార్గము అని పిలువబడినది (యెషయా 9:1). గలిలయను ప్రత్యేకముగా ప్రస్తావించుచూ, డోనాల్ ఎ. హేగ్నర్ దాని గూర్చి ఇలా వ్యాఖ్యానించాడు

> “సముద్ర మార్గము” ... రోమా ప్రభుత్వ ఆధీనములో నుండిన రహదారియై (*via maris*) యుండి దమస్కు పట్టణమును మధ్యధరా తీరమున నున్న కైసరయ ప్రాంతముతో కలుపుచుండెను, దీని శాఖ యేసు పరిచర్యలో కీలకమైన నగరములై యుండిన బేత్సయిదా మరియు కపెర్నహూముల గుండా వెళ్లుచు, గలిలయ సముద్ర పశ్చిమ తీరమున కొనసాగుచుండినది.[3]

కపెర్నహూము జనసాంద్రత భారీగా నుండిన పాలస్తీనాలోని భాగములో సుఖప్రదముగా నెలకొని యుండి దాని భద్రతను కూడ అనుభవించుచుండెను. యూదా మత చరిత్రకారుడైన జోసీఫస్, గలిలయకు గవర్నర్‌గా నుండినవాడు, ఆ ప్రాంతములో 240 గ్రామములు మరియు పట్టణములుండినవనియు, వాటిలో ఏ ఒక్కటైనను పదిహేను వేల కంటె తక్కువ జనాభా కలిగియుండలేదనియు గ్రంథస్థం చేశాడు.[4]

గలిలయ ప్రాంతములోని జనాభా బహుళ జాతీయమైనదై యుండెను. అది క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దము మొదలుకొని రెండవ శతాబ్దము వరకు కూడ అన్యజనులతో జనసమ్మర్ధమైనదై యుంటూ అధికంగా అన్యజనుల చేత వారి ఆధీనములో ఉంచుకొనబడి యుండినది మరియు అన్యజనులుండిన దేశములు దాని చుట్టూర ఉండినవి కాబట్టి

అది అన్యజనుల **గలిలయ ప్రదేశమని** పిలువబడినది (యెషయా 9:1). సిరియా దేశము గలిలయకు ఈశాన్యములో ఉండినది, ఫేనికేయుల వంశస్థులు పశ్చిమమున నివసించుచుండిరి, సమరయులు దక్షిణ ప్రాంతములో నివసించుచుండిరి. మొదటినుండి, గలిలయలోనికి అన్యజనులు అక్రమంగా చొరబడుచుండిరి గనుక సొలొమోను ఇరువది గలిలయ ప్రదేశ పట్టణములను హీరామునకు, తూరు దేశమునకు రాజైన వానికి ఇచ్చివేశాడు (1 రాజులు 9:11). అంతమాత్రమే గాక, ఈ భూభాగము ఇయ్యబడిన ఇశ్రాయేలీయులు వారి కంటె ముందుగా అచ్చట నివసించుచుండిన అన్యమతారాధికులైన జనులను (న్యాయాధిపతులు 1:30, 33) సంపూర్తిగా వారి దేశము నుండి వెలుపలికి వెళ్లగొట్టలేదు. గనుక గలిలయ ప్రదేశము ఈ ప్రజల నానావిధ సాంప్రదాయ వాడుకలు మరియు సంస్కృతుల చేత పాలస్తీనాలోని ఏ ప్రాంతము ప్రభావితము కానంతగా ప్రభావితమయ్యింది. వారు "ఎప్పుడు చూచినా ఏదో ఒక నవకల్పన యందే వారి ఆసక్తిని కనుపర్చుచుండిరనియు, స్వభావసిద్ధంగా వారు మార్పులకు ఉన్ముఖులై యుండిరనియు, గనుక వారు విద్రోహ చర్యల యందు ఆనందించుచుండిరనియు" జోసీఫస్ చెప్పాడు.[5]

అష్షూరీయుల చేత విధ్వంసము చేయబడి ఆధ్యాత్మిక **అంధకారములోనికి** పడద్రోయబడిన ప్రాంతము ఒకానొక కాలమున దేవుని సత్యమును ప్రకాశవంతమైన **వెలుగును** చూచునని ప్రస్తావింపబడిన ఈ ప్రవచనము (యెషయా 9:2) దాని కళ్ల ముందున్నట్లుగా చూచినది. లోకములోనికి వచ్చు ఈ వెలుగు మొదట యూదాలో లేక యెరూషలేములో ప్రకాశించదు, కానీ మొదట అంధకారములో నున్న ఈ ప్రదేశములో ప్రకాశించుచున్నట్లు చూడబడునని ప్రవక్త నిశ్చయపర్చాడు. "అంధకారము" అను పదము అధ్యాత్మిక అంధత్వమను, నైతిక పతనమును, లేక నిరాశాపూరితమైన అధైర్యమును వర్ణించుచున్నది. దీనికి వ్యతిరేకమైనది, "వెలుగు," ఆధ్యాత్మికముగా నిశితమైన అవగాహనను లేక తెలివిని, నీతిపూర్వకమును, సంతోషభరితమునైన ఒక జీవితమును సూచించుచున్నది. యేసు ఈ ప్రదేశములోనికి వచ్చుట వలన దానిపై ఎంతో కాలంగా అడ్డుగా వ్రేలాడదీయబడియున్న అంధకార తెర తొలగించి సత్యమను గొప్ప వెలుగుతో దానిని ప్రజ్వరిల్లజేయును. యేసు తానే "వెలుగై" యుండును (యోహాను 1:4, 8, 9; 3:19; 8:12; 12:46).

యేసు ఎవరికొరకై వచ్చాడో ఆ **ప్రజలు** యూదీయులై యుండిరి. వారి జాతీయతకు గుర్తింపునిచ్చుటకు మత్తయి ఈ గ్రీకు పదమును తరుచుగా ప్రయోగించుచుండును (1:21; 2:4, 5; 4:23; 9:35; 13:13, 15; 15:7–9; 21:23; 26:3, 5, 47; 27:1, 25, 64). "ఇశ్రాయేలు వంశములని నశించిన గొఱ్ఱెలు" యేసు పరిచర్య యొక్క గురియై యుండిరి (10:6; 15:24). ఈ యూదులు "అన్యజనులు నివసించుచుండిన గలిలయలో" నివసించుచుండిరను వాస్తవము "సమస్త జనుల కొరకు" ఉద్దేశింపబడినదైయున్న సువార్త సందేశము యొక్క సార్వత్రిక స్వభావమునకు ముందు ఛాయయై యున్నది (28:19; 1:3; 2:1పై రాయబడిన వ్యాఖ్యానములను చూడుము).

**వచనము 17. అప్పటి నుండి** అను పదజాలము యేసు క్రీస్తు యొక్క కార్యకలాపములలోని ఒక నూతన ఘట్టమును సూచించుచున్నది. **యేసు ... ప్రకటింప మొదలు పెట్టెను** అను పదములు ఆయన బాప్తిస్మము పొందినది మొదలుకొని యోహాను

చెరసాలలో వేయబడిన మధ్యకాలములో యేసు ప్రకటించుచుండలేదని సూచించదు, ఏలయనగా ఆయన గలిలయలోని ఇతర ప్రాంతములయందు బోధించుచుండెనని లూకా చెప్పుచున్నాడు (లూకా 4:14, 15). "యోహాను చెరపెట్టబడిన తరువాత యేసు దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెను" అని మార్కు 1:14 చెప్పుచున్నది. "ప్రకటింప మొదలు పెట్టెను" అని మత్తయి ప్రయోగించుచున్న పదజాలము యోహాను అదివరకు వెళ్లని ప్రదేశములకు యేసు వెళ్లాడని అర్థమిచ్చుచున్నది అది ఆయన పరిచర్య ప్రారంభించిన తోలి రోజుల్లో ఆయన చేసిన బహిరంగ బోధల గూర్చిన ఒక సారాంశ ఘోషణగా పనికివచ్చుచున్నది.

ప్రజలు **మారుమనస్సు పొందవలెనని** యేసు వారికి పిలుపునిచ్చుచుండెను, మారుమనస్సు అను పదము మార్పునొందిన జీవితమునకు దారితీయు మనస్సులో కలిగిన ఒక మార్పును సూచించుచున్నది. **పరలోక రాజ్యము సమీపించియుండిన** హేతువునుబట్టి ప్రజలు మారుమనస్సు పొందవలసిన అవసరం ఎంతైనా ఉండినది. ఆ సమయానికి రాజ్యము యింకా రాలేదు, కానీ దాని రాక అతి సమీపముగా నుండినది. దేవుని రాజ్యములో ప్రవేశింపగోరు వారు మారుమనస్సు పొందుట ఒక నిరాపేక్షమైన అవశ్యకతయై యున్నది (లూకా 13:3, 5; అపొస్తలుల కార్యములో 2:38; 17:30). జాక్ పి. లూయిస్ ఇలా వ్యాఖ్యానించాడు, "ఈ విషయంలో యేసు ప్రబోధించుచుండిన సందేశము అదివరకు బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించిన సందేశమును (మత్తయి 3:2) మరియు అటుతరవాత ఆయన శిష్యులు ప్రకటించిన సందేశమును (మత్తయి 10:7) చెప్పుచున్నది."[6]

### మొదటి శిష్యుల పిలుపు (4:18–22)

**[18]యేసు గలిలయ సముద్రతీరమున నడుచుచుండగా, పేతురనబడిన సీమోను అతని సహోదరుడైన అంద్రెయ అను ఇద్దరు సహోదరులు సముద్రములో వలవేయుట చూచెను; వారు జాలరులు. [19–20]ఆయన నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టుజాలరులనుగా చేతునని వారితో చెప్పెను; వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి. [21]ఆయన అక్కడ నుండి వెళ్లి జెబెదయి కుమారుడైన యాకోబు, అతని సహోదరుడైన యోహాను అను మరి యిద్దరు సహోదరులు తమ తండ్రియైన జెబెదయి యొద్ద దోనెలో తమ వలలు బాగుచేసి కొనుచుండగా చూచి వారిని పిలిచెను. [22]వెంటనే వారు తమ దోనెను తమ తండ్రిని విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి.**

మత్తయి రచించిన ఈ నివేదిక యేసు తన శిష్యులలోని మొదటి నలుగురు శిష్యులను ఎంపిక చేసికొనిన తీరును తెలియజెప్పుచున్నది. ఇరువురు తోబుట్టువులుండిన సహోదరులు రెండు బృందములను: పేతురు మరియు అంద్రెయ (4:18–20) మరియు యాకోబు మరియు యోహానులను (4:21, 22) యేసు పిలిచిన విషయము గూర్చి సమాంతరమైన కథలు ఇవ్వబడిన యున్నవి. ఈ కథలో ఒకే అంశములున్నవి: (1) యేసు కదలికలు, (2) ఈ తోబుట్టువులను యేసు గమనించుట, (3) జాలరులుగా వారి కార్యకలాపములు, (4) శిష్యత్వమునకై యేసు అందించిన ఆహ్వానము, మరియు (5) శిష్యుల ప్రతిస్పందన.[7]

యేసు వీరిలో కనీసము ఇరువురినైనా ఎదుర్కొనుట ఇది తోలి సారి కాదు. ఫిలిప్పు

మరియు నతానియేలుతో కూడ, పేతురు మరియు అంద్రెయ, యేసు బాప్తిస్మము పొందిన పిదప ఆయన గలిలయకు తిరిగి వచ్చుచుండిన సమయంలో వారు యేసుతో కూడ ఉండిరి (యోహాను 1:35–45). ఆ వాక్యభాగములో పేర్కొనబడిన కనీసము నలుగురు శిష్యులు యేసు తన మొదటి సూచక క్రియను గలిలయలోని కానాలో చేసినప్పుడు ఆయనతో కూడ ఉండిరి (యోహాను 2:1, 2).

శిష్యుడనబడువాడు, వాడు వెంబడించువానికి ఒక "అనుచరుడై" లేక ఒక "విద్యార్థియై" యుండును. యూదా విద్యార్థులు ఒక ఉపదేశకుని కొరకు వెదకుట యూదులలో సర్వసామాన్యమైన అంశమై యున్నది (యోహాను 15:16).[9] యేసు తన పరిచర్యను ప్రారంభించిన తొలి రోజుల్లో, ఆయనను వెంబడించుచుండిన శిష్యులు అసంఖ్యాకులై యుండిరి. జనసముహములు ఆయనను వెంబడించుచుండిరి. ఈ కాలములో, ఆయన సందర్శింపవలెనని ప్రణాళిక వేసికొనిన కొన్ని యూదుల పట్టణములలో మార్గమును సుగమము చేయునట్లు ఆయన డెబ్బది మంది శిష్యులను ఒక "పరిమితమైన ప్రేషితోద్యముపై" పంపించాడు (లూకా 10:1). ఏదో ఒక సందర్భంలో, భారీ సంఖ్యలో నుండిన ఈ గుంపులో నుండి, ఆయన తన అపొస్తలులైనవారిని పన్నెండు మందిని యేసు ఏర్పరచుకొన్నాడు (లూకా 6:13–16; మత్తయి 10:1–4 చూడుము). ఆయన వారిని "అపొస్తలులు" అని పిలిచాడు ఏలయనగా ఆయన వారిని ఎన్నుకొన్నాడు, వారికొక బాధ్యత నప్పగించాడు, మరియు వారు ఆయన పక్షముగా కార్యములు చేయగల అధికారముతో పంపించాడు. యేసు ఏర్పరచుకొనిన ఆ పన్నెండు మంది ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుటకు ఆయనకు వ్యక్తిగత రాయబారులయ్యారు (అపొస్తలుల కార్యములు 1:8). మత్తయి 4:18–22లో పేర్కొనబడిన యేసు పిలిచిన నలుగురు శిష్యులు ఆయనకు అత్యంత సన్నిహితమైన అపొస్తలులయ్యారు (17:1; 26:37; మార్కు 5:37; 13:3).

**వచనము 18.** యేసు **సీమోనును** మరియు అతని సహోదరుడైన **అంద్రెయను** కలిసికొనినప్పుడు, వారు చేపలు పట్టుచుండిరి. వారు ఉపయోగించిన వల వలయాకారము గలదై అది నీళ్లలోనికి విసరబడినప్పుడు మునిగిపోవుటకు తగినంత బరువుండునట్లు దాని అంచుల్లో సీసపు గుళికలు అమర్చబడి యుండును.[10] వీరు, వారి తండ్రియైన జెబెదయితో కూడ నుండిన యాకోబు మరియు యోహానులతో కలిసి, చేపల వ్యాపారము చేయుచుండిరి (మార్కు 1:20; లూకా 5:7, 10). బేత్సయిదా, సీమోను మరియు అంద్రెయల స్వస్థలమై యున్నది (యోహాను 1:44), కానీ వారు ఇటీవలనే కపెర్నహూములో స్థిరనివాసమేర్పరచుకొన్నారు (8:5, 14; మార్కు 1:21, 29; లూకా 4:31, 38).

యేసు సీమోనుకు "కేఫా" (అరమెయిక్) లేక **పేతురు** (గ్రీకు) అని నామకరణం చేశాడు, దీనికి "రాయి" అని అర్థం (యోహాను 1:42). అతడు "ఆశాజనమకమైనవాడు, ధైర్యవంతుడు [ఆత్మ] విశ్వాసంగలవాడు, సాహసవంతుడు, సరళమైనవాడు, దుడుకుతనముగలవాడు, శౌర్యముగలవాడు, శక్తిశాలి, బలమైనవాడు, మరియు ప్రేమమయుడు, మరియు యేసు సిలువమరణము నొందక మునుపు ఆయనను విడిచిపెట్టినప్పటికిని, తన యజమానుని యెడల విశ్వసనీయుడుగా అతడు చిత్రీకరింపబడవచ్చును."[11]

"అంద్రెయ" గ్రీకు నామమై యున్నది, దీనికి "ధైర్యముగల" లేక "మగసిరిగల" అని అర్థము. యేసును వెంబడించిన పన్నెండు మంది శిష్యులలో మొట్టమొదటివాడై యున్నాడని

అగుపించుచున్నది (యోహాను 1:40). అతడు యేసుకు పరిచయము చేయబడిన మరుక్షణములోనే, తన సహోదరుడైన సీమోనును కనుగొనుటకు వెళ్లి అతనిని యేసు నొద్దకు తీసుకొని వచ్చాడు (యోహాను 1:41, 42). ఇతడు తరుచుగా కేవలము "సీమోను పేతురు సహోదరుడు" అని ప్రస్తావింపబడుచుండెను (యోహాను 1:40; 6:8; మత్తయి 10:2; లూకా 6:14 చూడుము) అంతమాత్రమేగాక ఇతరులను కూడ తీసుకొనివచ్చినవాడుగా పేరెన్నికగొన్నవాడై యున్నాడు (యోహాను 6:8, 9; 12:20–22). అంద్రెయ అశావాదిగాను, నిస్వార్థపరుడుగాను వర్ణింపబడియున్నాడు.

**వచనములు 19, 20.** యేసు పేతురును మరియు అంద్రెయను చూచి, **నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతును** అని చెప్పాడు. గ్రీకులో, "వెంబడి రండి" అని అనువదింపబడిన పదము ఒక స్థలమునకు సంబంధించిన క్రియావిశేషణమై, ఒక బలమైన ఆజ్ఞ యొక్క ప్రభావముగలదై యున్నది. "నా వెంబడి రండి" అను మాటలను "నన్ను వెంబడించుడి" అని కూడ అనువదింపవచ్చును. విద్యార్థులు వారి బోధకుల నుండి నేర్చుకొనునట్లు వారు వెళ్లిన ప్రతి చోటికి వారిని వెంబడించుట అక్షరాలా సర్వసామాన్యమైన సంగతై యుండినది. వారి ముందున్న ప్రేషితోద్యమ భారమునకు యేసు వారిని సముచితముగా సమాయత్తము చేయునని "నేను మిమ్మును ... చేతును" అను మాటలు సూచించుచున్నవి.

ఈ సహోదరులు చేపలు పట్టుచుండిన జాలరులై యుండిరి, కానీ వారు "మనుష్యులను పట్టు జాలరులౌదురు." ఇదే సందర్భమై యున్నదిగా అగుపించుచున్న అంశమునకు లూకా మరి కొన్ని వివరములను చేర్చుచున్నాడు (లూకా 5:1–11). అందరిని ఆశ్చర్యచకితులు జేయునంతటి చేపలు పట్టిన పిమ్మట – అవి వారి దోనెను సముద్రములో ముంచివేయుటకు చాలినవై యుండినవి – యేసు "భయపడకుము, ఇప్పటి నుండి నీవు మనుష్యులను పట్టువాడవై యుందువు" అని సీమోనుతో చెప్పాడు (లూకా 5:10). మనుష్యులు పట్టుట యను మనఃకల్పన దాని మూలములను పాత నిబంధనలో కలిగియున్నది, ఆ సందర్భములో వారికి తీర్పు తీర్చబడునట్లు ప్రజలను ఒక చోటికి పోగుచేయుట గూర్చినదై యున్నది (యిర్మీయా 16:16; ఆమోసు 4:2; హబక్కూకు 1:14–17). ఇదే మనఃకల్పన క్రొత్త నిబంధనలో, వారు రక్షణనొంది దేవుని రాజ్యములోనికి ప్రవేశించునట్లు ప్రజలు సమకూర్చుట గూర్చినదై యున్నది. మత్తయి 13:47లో గల ఉపమానము సువార్త యను వల వ్యాపించి క్రీస్తు కొరకు వీలైనంత మందిని పట్టుకొను విషయమును తెలియజేయుచున్నది.[12] "అది యిక మీదట చేపలను ఒక సరస్సులో/సముద్రములోనుండి పట్టుటకు సంబంధించిన ఒక ప్రశ్నయై యుండదు, కానీ మనుష్యులను దేవుని యొక్క గొప్ప వలలో పట్టి, పాపము మరియు తత్ఫలితమైన మరణమను అగాధములోనుండి వారిని వెలుపలికి ఆకర్షించుట గూర్చినదై యున్నదని" ఒక వ్యాఖ్యానకర్త చెప్పుచున్నాడు.[13] యేసు ఇచ్చిన మహా అదేశములో – అది తొలుత అపొస్తలులకు ఇవ్వబడినది కానీ "యుగ సమాప్తి" (మత్తయి 28:20) యేసును వెంబడించువారి నిమిత్తము ఉద్దేశింపబడినదై యున్నది – అది ఆయన శిష్యులందరి విషయంలో ఆయన కోరికయై యున్నదని యేసు విపులంగా చెప్పాడు.

ప్రభువిచ్చిన పిలుపునకు పేతురు మరియు అంద్రెయలు తత్క్షణమే సుముఖంగా

ప్రతిస్పందించారు. **వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి** అని మత్తయి చెప్పుచున్నాడు మత్తయి 4:18లో ఉన్నట్లు "వల" యను నిర్దిష్టమైన పదము గాక, ఈ వచనములో "వలలు" అని అనువదింపబడిన గ్రీకు పదము అత్యంత సాధారణమైనదైయుండి విభిన్నమైన అనేక వలలను సూచించుచున్నది.

"వారు దోనెలను దరికి చేర్చి, సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి" అని లూకా 5:11 చెప్పుచున్నది. అటు తరువాత, వారు "సమస్తమును" త్యాగము చేసిన విషయాన్ని పేతురు యేసు ఎదుట అభివ్యక్తము చేశాడు: "ఇదిగో, మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమి; గనుక మాకేమి దొరుకును?" (మత్తయి 19:27). అందుకు యేసు, వారాయన శిష్యులై యుండునట్లు త్యాగము చేసిన వాటి కంటే వారు పొందుకొననైయున్న ఆశీర్వదములు ఎన్నో రెట్లు అధికంగా ఉండునని తన శిష్యులకు అభయమిచ్చాడు (19:28–30).

**వచనములు 21, 22.** యేసు **యాకోబు** మరియు **యోహానును** సమీపించినప్పుడు, ఈ **సహోదరులు** తమ **తండ్రి ... యొద్ద దోనెలో తమ వలలు బాగుచేసికొనుచుండిరి.** "బాగుచేసికొనుట" అను క్రియా పదమునకు "పునరుద్ధరించుకొనుట" లేక "సరైన స్థితిలో ఉండునట్లు చూచుకొనుట" అని అర్థము. జాలరుల వలలకు సంబంధించినంత వరకు, ఈ పదము వలలను శుభ్రము చేసికొనుట, లేక శుభ్రము చేసిన తరువాత వాటిని చక్కగా మడతపెట్టుట అను అర్థములనిచ్చును.

**ఆయన వారిని పిలిచెను** అని ఈ వాక్యభాగము మామూలు మాటల్లో చెప్పుచున్నది. ఆయన వారికి ఏమని సెలవిచ్చాడో వీరితో కూడ అవే మాటలు పలికియుండునని భావించుట సహేతుకమైనదై యున్నది: "నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతును" (4:19). వీరి ప్రతిస్పందన సహితము పేతురు మరియు అంద్రెయ ప్రదర్శించినటువంటిదే: **వెంటనే వారు ... విడిచిపెట్టి అయనను వెంబడించిరి.** వారు ఆయన యొక్క అపొస్తలులై యుండునట్లు సమస్తమును – వారి చేపల వ్యాపారమును, ఇండ్లను,మరియు కుటుంబములను – విడిచిపెట్టారు (మత్తయి 19:27–30).

మనము **జెబెదైని**, యాకోబు మరియు యోహానుల తండ్రియైనవానిని, లేఖనములలో కలిసికొను సందర్భము ఒక్కటే. అతని పేరునకు "యాహ్వే [దేవుడైన యెహోవా] వరము" అని అర్థము. అతని సతిమణి సలోమే, మరియ, యేసు తల్లి యొక్క సహోదరియై యుండవచ్చును (మత్తయి 27:56; మార్కు 15:40; యోహాను 19:25). ఇదే నిజమైనట్లతే, యేసు, యాకోబు మరియు యోహానుకు బంధువే అని స్పష్టమగుచున్నది. గనుక యేసు వారిని పిలువగానే వారెందుకంత శీఘ్రముగా అయనను వెంబడించిరో, వారి తండ్రి ఎందుకు ఆక్షేపించలేదో మనకు వివరించుటకు భౌతికపరమైన ఈ సంబంధము సహాయకరముగా నుండగలదు.

యాకోబు మరియు యోహానులకు "బోయనేర్గసు" అనగా, "ఉరిమెడువారని" అర్థమిచ్చు మారుపేరు పెట్టబడినది (మార్కు 3:17). యేసును తృణికరించిన ఒక సమరయ పట్టణము మీద ఆకాశము నుండి అగ్ని కురిపింపబడవలెనని వారు కొరినప్పుడు వారు కలిగియుండిన తొందరుపాటుతో కూడినది మరియు పౌరుషమైన భావోద్రేకము ప్రదర్శింపబడినది (లూకా 9:51–56) యాకోబు మరియు యోహాను వారి తాహతుకు మించిన అత్యాశపారులని

కూడ చిత్రీకరింపబడిరి. వారికి ఆయన రాజ్యములో ముఖ్య స్థానములివ్వబడవలెనని, వారి తల్లి ద్వారా, వారు యేసును విన్నవించుకొన్నారు (20:20–28; మార్కు 10:35–45). వారు యేసుతో కూడ గడిపిన కాలము వారి జీవితములనే మార్చివేసిది. "యేసు ప్రేమించిన శిష్యుడు" అని శిష్యుడైన యోహాను పిలువబడుచున్నాడు (యోహాను 13:23; 20:2; 21:7, 20–24), మరియు అపొస్తలులలో యేసు నిమిత్తము హతసాక్షియైన తొలి అపొస్తలుడు శిష్యుడైన యాకోబే (అపొస్తలుల కార్యములు 12:1, 2).

### గలిలయలోని తొలి పరిచర్య (4:23–25)

**[23]యేసు వారి సమాజమందిరములలో బోధించుచు, (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు, ప్రజలలోని ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయయందంతట సంచరించెను. [24]ఆయన కీర్తి సిరియ దేశమంతట వ్యాపించెను. నానా విధములైన రోగముల చేతను వేదనల చేతను పీడింపబడిన వ్యాధిగ్రస్తులనందరిని, దయ్యముపట్టినవారిని, చాంద్రరోగులను, పక్షవాయువు గలవారిని వారు ఆయన యొద్దకు తీసికొని రాగా ఆయన వారిని స్వస్థపరచెను. [25]గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూదయయను ప్రదేశములనుండియు యొర్దానునకు అవతలనుండియు బహు జనసమూహములు ఆయనను వెంబడించెను.**

మత్తయి ఇప్పుడు యేసు గలిలయ ప్రాంతములో చేసిన తొలి పరిచర్య వైపు తన దృష్టిని మళ్లించాడు. ఆయన రచించిన సువార్త యందంతటను మత్తయి సంక్షిప్తమైన సారాంశములను చేర్చాడు (4:23–25; 8:16, 17; 9:35; 12:15, 16; 14:14, 35, 36; 15:29–31; 19:1, 2; 21:14).

**వచనము 23.** యేసు **గలిలయ** యందంటను ఆయా ప్రాంతముల చుట్టు తిరుగుచు మరలా తన కేంద్రమునకు చేరుకొనిన అనేక పరిచర్యలలో ఇది మొదటిది (9:35–11:1; లూకా 8:1–3 చూడుము). ఈ ప్రాంతము పాలస్తీనా యొక్క ఉత్తర భాగములో నుండెను (4:15పై గల వ్యాఖ్యానమును చూడుము). ఈ ప్రాంతములో అన్యజనుల జనాభా అత్యధికమైనదై యుండినప్పటికిని, యేసు తన **ఉపదేశములను** మరియు ప్రబోధములను ఎక్కువగా సమాజమందిరములలో చేశాడని స్పష్టమగుచున్నది (9:35; 12:9; 13:53), మరియు ఆయన పరిచర్య యూదులకు పరిమితమైనదై యుండినదని నొక్కివక్కాణింపబడుచున్నది (10:5, 6; 15:21–28).

ప్రస్తుతము, దాదాపుగా క్రీ.పూ. 200 సంవత్సరముల వరకు అవి చారిత్రకంగా ప్రస్తావించబడనప్పటికిని, సమాజమందిరములు బబులోను చెరకాలములో ఉపయోగములోనికి వచ్చాయని నమ్మబడుచున్నది.[14] అవి యూదీయ మత సంబంధమైన జీవితమునకు ప్రధాన కేంద్రములై యుండినవి. ఇవి ఆనాటి "దేవాలములై" యుండినవి, లేఖనములు చదువబడగా వినుటకును ఆ తరువాత వాటి గూర్చి చర్చించుటకును సబ్బాతు దినాన ప్రజలందరు అచ్చట కూడుకొనుచుండిరి. మిష్నా ప్రకారము, ఎచ్చటెచ్చటైతే పదిమంది యూదీయ ప్రజలు నివసించుచుండిరో, అచ్చట ఒక సమాజ మందిరము వెలసినది.[15] క్రీ.శ. 70లో యెరూషలేము పట్టణము నాశనము చేయబడక మునుపు,

యెరూషలేములో 480 సమాజమందిరములు ఉపయోగములో ఉండినవని యెరూషలేము టాల్ముడ్ నివేదించుచున్నది[16]; 394 సమాజమందిరములుండినవని బబులోను టాల్ముడ్ చెప్పుచున్నది.[17]

ఆదర్శప్రాయంగా, సమాజమందిరము నగరం నడి బొడ్డున నిర్మింపబడుతొంది, అది అందరి కంటి చూపునకు సులభంగా అందుబాటులో ఉండునట్లు ఒక కొండపై కట్టబడుతుంది.[18] అట్లయినప్పటికిని, ఈ అభ్యాసము ఎల్లప్పుడు సాధ్యమయ్యేది కాదు. సాంప్రదాయక ఆచారముల ప్రకారము కాళ్లు చేతులు కడుగుకొనుటకు సౌకర్యవంతముగా నుండునట్లు సమాజమందిరము ఒక నదికి లేదా సముద్రమునకు సమీపములో నిర్మింపబడు ఉన్ముఖత ఉండినది.

సమాజమందిరములో నిర్వహింపబడుచుండిన ఆరాధనలు "ఏలిక(ల)" చేత లేదా "అధికారి(రుల)" చేత నిర్వహింపబడుచుండినవి (మార్కు 5:22; లూకా 8:41; అపొస్తలుల కార్యములు 18:8, 17). ఆరాధనలు ఏర్పాటు చేయుచు అవి సక్రమంగా నిర్వహింపబడునట్లు చూచుట ఈ నాయకుల బాధ్యతలై యుండినవి (లూకా 13:14). ధర్మశాస్త్రము మరియు ప్రవక్తల లేఖనములు చదువబడిన తరువాత, కూడుకొని యుండినవారినుద్దేశించి సందేశమునందించుటకు సమాజమందిర అధికారి సందర్శక అతిథిగా వచ్చిన రబ్బీని ఆహ్వానించుదురు (అపొస్తలుల కార్యములు 13:15; లూకా 4:16-27 చూడుము). వారు ప్రజలకు బోధించగలుగునట్లు ఈ వాడుక యేసునకును ఆయన శిష్యులకును అవకాశములు కల్పించినది.

యేసు లేఖనములలో నుండి ఉపదేశించుచుండెను, కానీ ఆయన **రాజ్య సువార్తను సహితము ప్రకటించుచుండెను.** "సువార్త" అను పదమునకు "శుభ వర్తమానము" అని అర్థము. 17వ వచనములో ప్రస్తావింపబడినది కూడ ఇదే సందేశమై యుండవచ్చును: "పరలోక రాజ్యము సమీపించి యున్నది, గనుక మారుమనస్సు పొందుడి." రాజ్యము యింకను రానప్పటికిని, అది సమీపములో ఉండినది గనుక త్వరలో, యేసు ఉపదేశించిన అనేకుల జీవిత కాలములో, రానై యుండినది (మార్కు 9:1 చూడుము). "ఆయన పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు" యేసు ఈ సందేశమును ప్రకటించుచు, "దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచుండెను" (అపొస్తలుల కార్యములు 1:2, 3).

ఆయన బోధించుట మరియు ఉపదేశించుట మాత్రమే కాదు, కానీ **ప్రజలలోని ప్రతి విధమైన వ్యాధిని, రోగమును స్వస్థపరచుచుండెను.** యేసు చేసిన అద్భుతములు ఆయనను బాప్తిస్మమిచ్చు యోహాను నుండి విలక్షణమైనవానిగా ప్రదర్శించిన భాగమై యుండెను. బాప్తిస్మమిచ్చు యోహాను అద్భుతములు చేయలేదు. దానికి మూలము లేదా మూలాధారమేదై యుండినప్పటికిని దానితో నిమిత్తము లేకుండా, యేసు ఎటువంటి వ్యాధినైనను లేక రోగమునైనను స్వస్థపరచగలవాడై యుండెను. సంపూర్ణ స్వస్థతను చేకూర్చగల అధికారము ఆయన కలిగియుండినందున యేసు నిజముగా దేవుని యొద్దనుండి పంపబడిన మెస్సీయయై యున్నాడనుటకు అదొక సహేతుకమైన సంకేతమై యుండినది (11:2-6).

**వచనము 24.** యేసు చేసిన అద్భుతముల యొక్క ప్రత్యక్ష ఫలితంగా, ఆయన కీర్తి **సిరియా దేశమందంతట వ్యాపించెను.** మొదటి శతాబ్దములో, "సిరియ" దేశము దానిలో పాలస్తీనా కూడ కలిసియుండిన ఒక సువిశాలమైన రోమా సామ్రాజ్య భాగమును

సూచించినది (లూకా 2:2). ఇచ్చట పేర్కొనబడిన ప్రదేశము పేరు గలిలయకు ఉత్తరమున నుండిన దేశమును మాత్రమే సూచించుచున్నదని కొందరు నమ్ముచుండగా, అది 4:25లో పేర్కొనబడిన దేశములన్నిటిని చుట్టుముట్టి యుండినట్లు అగుపించుచున్నది.

యేసు యొక్క పేరు ప్రఖ్యాతలు పలు ప్రదేశములలోనికి ప్రాకిపోయినందున ఆయా ప్రాంతములయందున్న ప్రజలందరు రోగగ్రస్తులై యున్నవారందరిని, **దయ్యముపట్టినవారిని, మూర్ఛరోగముగలవారిని, మరియు పక్షవాతముగలవారిని** సహితము ఆయన యొద్దకు తీసికొనివచ్చుచుండిరి. నానావిధములైన ఈ రోగులు మరియు రోగముల గూర్చి పేర్కొనబడుటలో గల ఉద్దేశము యేసుకు సమస్త విధములైన అనారోగ్య స్థితిగతులపై అధికారముండినదనియు, గనుక ఆయన శక్తి సామర్థ్యము స్వస్థపరచుటకు మాత్రమే పరిమితమైనది కాదనియు చూపించుటయే అయియున్నది.

**వచనము 25.** బహు జనసముహములు ఆయన వెళ్లుచుండిన ప్రతి చోటికి యేసును వెంబడించుటకు ఆరంభించుట ఆయన పొందిన గొప్ప ప్రజాదరణకు మరొక ఫలతమై యున్నది. ఈ జనసమూహములు **గలిలయ** దేశము నుండి మాత్రమే కాదు కానీ పాలస్తీనా దేశములోని పలు ప్రాంతముల నుండి వచ్చినవారైయుండిరి.

**దెకపొలి**, యొర్దానుకు ఆవల నుండిన ఒక జిల్లాయై యుండినది, మరియు దాని గ్రీకు పేరునకు గల అర్థము ననుసరించి, సరిగ్గా పది పట్టణములు కలిసియుండినవి. హెల్లేనీయులకు సంబంధించిన ఈ నగరములు, దమస్కు, ఫిలదెల్ఫియ, రఫానా, స్కిథోపొలి (బేత్షయిన్), గదరా, హిప్పో, డియోన్, పెల్ల, గెర్షా, మరియు కనతా అయియున్నవని ప్లిని ది ఎల్డర్ చేత గుర్తింపబడినవి.[19] దెకపొలి దేశమంతయు మహా అలెగ్జాండర్ యొక్క మాజి సైనికుల చేత జనసాంద్రతలగల దేశమయ్యిందనియు, ఆ పట్టణము యొక్క ప్రాథమిక గ్రీకు సంస్కృతిని కాపాడుటకు వారు తమ సహయసహకారముల నందించుచుండిరనియు సామాన్యముగా విశ్వసింపబడినది. స్కిథోపొలి మినహాయిస్తే, యొర్దానుకు పశ్చిమమున నుండిన దేశము, మిగిలిన పట్టణములన్నియు యొర్దానుకు తూర్పున ఉండినవి.

యేసు ఉపదేశములను ఆలకించుటకు జనసముహములు ఎంతో దూర ప్రయాణ ంచేసి వచ్చుచుండిన విషయాన్ని మత్తయి నొక్కివక్కాణించుచు, **యెరూషలేము, యూదయ,** మరియు **యొర్దానుకు ఆవల నుండిన ప్రదేశములు** గూర్చి పేర్కొనుచున్నాడు. ఈ చివరి పదసముదాయము పెరియ పట్టణమును సూచించుచున్నది.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### నశించినవారిని చేరుట కొరకైన దేవుని ప్రణాళిక: బోధించుట (4:12–25)

యేసు బాప్తిస్మము పొందిన ఆ తరవాత శోధనలు ఎదుర్కొని వాటిని జయించిన పిమ్మట, ఆయన బోధించుచు, ప్రకటించుచు, మరియు స్వస్థపరచుచు తన పరిచర్యను ప్రారంభించాడు. ఆయనకు శిష్యులుగా నుండుటకై ఆయన కొందరు జాలరులను పిలిచాడు. మనము అధ్యయనము చేయుచున్న వాక్యభాగము నుండి మనము కొన్ని ముఖ్యమైన పాఠములు నేర్చుకొనవచ్చును:

1. నశించుచున్న మానవాళిని చేరుటకు దేవుని వాక్యమును బోధించుట దేవుని ప్రణాళికయై యున్నది (4:12–17).
2. మనకు ముందుండిన వారి స్థలములను మనము పూరింపవలసి యున్నది (4:12, 17).
3. దేవుని ప్రణాళిక ఎడతెరిపి లేకుండా కొనసాగునట్లు చూచుటకు మన స్థానములను ఇతరులు పూరించునట్లు మనము వారిని ఎన్నుకొని వారికి శిక్షణ నియ్యవలసి యున్నది (4:18–22).
4. యేసు చేసిన బోధములలో ముఖ్యమైన అంశములని ఆయన పరిగణించిన విషయములపై మనము మన దృష్టిని కేంద్రీకరించవలసి యున్నది (4:17, 23).
5. నిజమైన అద్భుతములకును, వారి ద్వారా చేయబడుచున్నవి కూడ నిజమైన అద్భుతములేయని ఆరోపించుటకు వంచకులు చేయు ప్రయత్నములకును మధ్య గల తారతమ్యమును మనము అర్థంచేసికొనవలెను (4:23, 24).

---

సూచనలు

[1]Leon Morris, *The Gospel According to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 80. [2]యేసు నజరేతులో తృణీకరింపబడినాడని 13:53–58 వరకు కూడ మత్తయి నివేదించుట లేదు. [3]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 73. [4]Josephus *Life* 45; *Wars* 3.3.2. [5]Josephus *Life* 17. [6]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 74. [7]Hagner, 76. [8]Mishnah *Aboth* 1.16. [9]యేసు జాలరులను పిలుచుటకును, ఏలీయా ఎలిషాను వ్యవసాయము చేయుట నుండియు పిలుచుటకు (1 రాజులు 19:19–21) మధ్య గల పోలికలను గమనించుము. [10]Lewis, 74.

[11]James M. Gray, "Peter, Simon," in *The International Standard Bible Encyclopedia*, ed. James Orr (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1939), 4:2349. [12]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 31. వలను గూర్చిన ఉపమానములో (13:47–50) మంచి చేపలను (విశ్వాసులను) చెడు చేపల (అవిశ్వాసులు) నుండి వేరుచేయుటకు దేవదూతలు బాధ్యులై యున్నారు. [13]Suzanne de Dietrich, *The Gospel According to Matthew*, trans. Donald G. Miller, Layman's Bible Commentary, vol. 16 (Richmond, Va.: John Knox Press, 1961), 26. [14]Ecclesiasticus 51:23. [15]Mishnah *Megillah* 1.3; 4:3; *Sanhedrin* 1.6; *Aboth* 3.6. [16]Jerusalem Talmud *Megillah* 3.1. మిష్నా మరియు గెమరా (మిష్నా యొక్క విశ్లేషణలో) నుండి ఎత్తి చెప్పబడిన ఉల్లేఖనములు మిళితము చేయబడి, (1) యెరూషలేము టాల్మాడ్ మరియు (2) బబులోను టాల్ముడ్‌గా (ఈ వ్యాఖ్యానములో "టాల్ముడ్" అని సూచింపబడినవి) సంకలనము చేయబడినవి. [17]Talmud *Ketuboth* 105a. [18]Talmud *Shabbath* 11a. [19]Pliny *Natural History* 5.16.74.